

యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఘట్‌కేసర్,జూలై28: నేటి యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన ఆలోచనా విధానంతో ముందుకు సాగాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, దాసు, సంజీవగౌడ్, బాల్‌రాజ్, రాందాస్, శ్రీనివాస్, రాజేష్, సత్యం పాల్గొన్నారు.

● బోనమెత్తిన పల్లెలు





వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో పండుగ వాతావరణం ఉట్టి పడుతోంది. ఆషాఢ మాసం సందర్భంగా బోనాల పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం పట్టణాలు, పల్లెల్లో ప్రజలు ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల నడుమ బోనాల ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాలతో వెళ్లి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పిల్లాపాపలను సల్లంగా చూడాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు. - తాండూరు/తాండూరు రూరల్, జూలై 28

కల్వకుర్తి నియోజకవర్గానికి

సీఎం వరాల జల్లు

- ఆమనగల్లులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని హామీ
- రూ.180 కోట్లతో తండాలకు బీటీరోడ్లు
- మాడ్గుల మండలంలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన
- మీర్ఖాన్‌పేట వద్ద వృత్తి నైపుణ్య వర్సిటీకి సీఎం స్థల పరిశీలన



వృత్తి నైపుణ్య వర్సిటీ ఏర్పాటుపై మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఆమనగల్లు/ఇబ్రహీంపట్నం/కందుకూరు, జూలై 28: కల్వకుర్తి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొట్ర గేటు వద్ద కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీ చంద్‌రెడ్డిలతో కలిసి వచ్చారు. అంతకు ముందు బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా, ముఖ్యమంత్రిగా మీ బిడ్డనను ఆదరించారని, భుజాన ఎక్కించుకుని తిప్పారన్నారు. మీ కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం కల్వకుర్తికి వరాలు ప్రకటించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు తాను కూడా అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. కల్వకుర్తిలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామన్నారు. బీటీ రోడ్లకు రూ.180కోట్లు వెచ్చిస్తామని ప్రకటించారు. ఆమనగల్లులో వృత్తి నైపుణ్య శిక్షణకు రూ.10కోట్లతో స్కిల్ డెవలప్‌సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆమనగల్లులో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కాలేజీలకు భవనాల నిర్మిస్తామన్నారు. మాడ్గుల మండలంలో పాఠశాలల అభివృద్ధికి రూ.10కోట్లు, మాడ్గులలో డ్రెయిన్ల నిర్మాణానికి రూ.5కోట్లు విడుదల చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. కడ్తాల సమీప ముచ్చర్ల వద్ద 50ఎకరాల్లో రూ.100కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని సీఎం వెల్లడించారు. ఆగస్టు 1న దీనికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఇక్కడ ఏటా 20వేల మందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. అన్ని తండాలకు బీటీ రోడ్లు వేస్తామన్నారు. హైదరాబాద్-శ్రీశైలం హైవేను త్వరలోనే నాలుగు లేన్లకు విస్తరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో కల్వకుర్తికి చెందిన ముగ్గురు మహిళలు తమకు డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ - మిగతా 7లో



రైల్వే ట్రాక్‌పై వంతెన

ఘట్‌కేసర్ రైల్వే వంతెన నిర్మాణ పనులను చూస్తే నత్తే నవ్వుకుంటుంది. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఏళ్ల తరబడి జాప్యమైతోంది. అసంపూర్తి పనులతో స్థానికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. పనులు పూర్తి చేయాలని పలు మార్లు వాహనదారులు ఆందోళనలు సైతం చేశారు. రోడ్డుపై నిరసన తెలిపారు. త్వరగానే పూర్తి చేస్తాం అని అధికారులు, నేతలు బుజ్జగిస్తున్నారు తప్పితే బ్రిడ్జి పనులు చేయించడం లేదు.

ఇంకెన్నేళ్లు?

ఘట్‌కేసర్ రైల్వే బ్రిడ్జి పనుల్లో తీవ్ర జాప్యం

- ముందుకు సాగని వంతెన పనులు
- అధికారులు, పాలకుల అలసత్వం... ప్రజల అవస్థలు
- వంతెన పనులతో ఘట్‌కేసర్‌కు బస్సులు బంద్!
- లెవెల్ క్రాసింగ్ వద్ద వాహనదారులకు నిత్య నరకమే

ఘట్‌కేసర్, జూలై 28: ఘట్‌కేసర్ రైల్వే వంతెన నిర్మాణ పనులను ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. ముగ్గురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు మారినా ఘట్‌కేసర్ రైల్వే వంతెన పనులు మాత్రం పూర్తవడం లేదు. తాజాగా పనులు ప్రారంభమైనట్టు హంగామా చేసిన నాయకులు, అధికారులు పిల్లర్‌కు గుంత తవ్వించి రైల్వేగేటును శాశ్వతంగా మూయించారు. పనులు మాత్రం కనీసం ముందుకు సాగడం లేదు. పనులు పూర్తి చేయాలని అఖిలపక్షాలు ఉద్యమాలు చేశాయి. ఇప్పుడు చేస్తాం.. అప్పుడు చేస్తాం అని బుజ్జగిస్తున్నారు తప్పితే బ్రిడ్జి నిర్మాణం మాత్రం పూర్తిచేయటం లేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి హయాంలో పనులకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి 15ఏళ్లు దాటింది. నాటి నుంచి అసంపూర్తి పనులతో పిల్లర్లు అలంకార ప్రాయమయ్యాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో గతంలో పిల్లర్ గుంతలో పడి ఓ యువకుడు చనిపోయాడు. వంతెన కోసం ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితుల ఆందోళన ఓ వైపు.. మరో వైపు నిధుల లేమి.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి నిర్మాణ పనులు మూలన పడుతున్నాయి.

గేటు వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

దక్షిణ మధ్య రైల్వేకు అటు ఉత్తర భారతానికి, ఇటు దక్షిణ భారతానికి ఘట్‌కేసర్ మీదుగా ఉన్న రైల్వే లైన్ ప్రధానమైంది కావడంతో ప్రతీ పది నిమిషాలకు ఓ రైలు రాకపోకలు కొనసాగిస్తుంది. నిరంతరంగా రైళ్ల రాకతో గేటు వేస్తుంటారు. అనేక సందర్భాల్లో గేటు వేసేందుకు వీలు కాక సిగ్నల్ ఇవ్వకుంటే నిమిషాల తరబడి రైళ్లు నిలిచిన సందర్భాలనేకం. ఒకసారి గేటు వేస్తే ఆరగంట పాటు తీసేందుకు వీలుండడం లేదు. కొన్ని సార్లు మూడు, నాలుగు రైళ్లు వెళ్లిన తర్వాత గానీ గేటెత్తడం లేదు. రైల్వేట్రాక్ ఘట్‌కేసర్‌టౌన్ మధ్య నుంచి ఉండడంతో ఇటు, అటు వెళ్లే వారు చాలా సమయం వేచి ఉంటున్నారు. నడుచుకుంటూ వెళ్లే వారు గేటు వద్ద ఒంగి వెళ్తున్నా వాహనదారులు మాత్రం వేచి ఉండక తప్పని పరిస్థితి. ఈ గేటు నుంచే కీసర, శామీర్‌పేట్, మేడ్చల్, బొమ్మలరామారం మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వరంగల్ జాతీయ రహదారికి, రాజీవ్ హైవేకు ప్రధాన లింకు రోడ్డు కావటంతో వేలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చీటికీ మాటికి రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద గేటు వేస్తుండడంతో ట్రాఫిక్ రద్దీ పెరుగుతుంది. వందలాది వాహనాలు నిలుస్తున్నాయి. జనాల అవస్థలు వర్ణనాతీతం.



అసంపూర్తిగా వదిలేసిన బ్రిడ్జి పనులు

నీడ కోల్పోతున్న నిర్వాసితులు



వంతెన పనుల జాప్యంపై దీక్ష (ఫైల్)

ఘట్‌కేసర్‌లోని కొండాపూర్ రైల్వే గేటుపై వంతెన నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న బాధితులు 125 మంది ఉన్నారు. తమకు పరిహారం ఇవ్వకుండా ఇళ్లు ఎలా కూల్చుతారని ఆందోళనకు చేశారు. రైల్వేశాఖ పరిహారం ఇవ్వక వారంతా కోర్టును ఆశ్రయించారు. వారికి గతంలో ఇళ్ల పట్టాలిచ్చారు గానీ పొజిషన్ చూపలేదు. ప్రతీ రాజకీయ నాయకుడు ఓట్ల సమయంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయిస్తామని, నిర్వాసితులకు పరిహారం ఇప్పిస్తామని చెబుతున్నారు తప్ప ఫలితం కన్పించడం లేదు. ఓట్లు అయిపోయాక ఇటువైపే చూడని పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు తమకు న్యాయం చేయించడం లేదని నిర్వాసితులు వాపోతున్నారు.

మూడు నెలల్లో పూర్తి చేస్తామన్న మాట నీటిమూటేనా?

మూడు నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేస్తామని కార్మిక శాఖ మంత్రి హోదాలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి 2023 ఆగస్టు 2న మారోసారి వంతెన పనులకు భూమిపూజ చేశారు. మూడు నెలల్లో పనులు పూర్తిచేసి చూపిస్తానన్న ఆయన మాటలు నెరవేరలేదు. పనులు సగమైనా కాలేదు. రోడ్డుకు ఇరువైపుల ఇళ్లను తొలగించకుండా పనులు చేపట్టడంతో పిల్లర్లు వేసే సమయంలో వాహనాల రాకపోకలకు స్థలం లేక ఏళ్ల తరబడి ఘట్‌కేసర్‌కు ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. దీంతో ఉద్యోగాలకు, ఇతర పనులకు నగరానికి వెళ్లే వారు రెండు కిలోమీటర్ల దూరంలోని బైపాస్ రోడ్డు వరకు ఆటోల్లో వెళ్తున్నారు. వంతెన నిర్మాణానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందోనని ప్రజలు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో మంత్రిగా ఉన్న మల్లారెడ్డి 2023 ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచినా నిర్మాణ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ నేతలకు, మంత్రులకు సమస్యలను వివరించారు. కాంగ్రెస్ నేతలు కాంట్రాక్టర్‌తో మాట్లాడగా పనులు ప్రారంభమయ్యాయి. ఈసారైనా పనుల వేగం పెరిగి బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందా? లేదా అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వంతెన పనులు ముగిసినా బస్సులు వచ్చే అవకాశం ఉందా? అని ప్రశ్నిస్తున్నారు.

పనులు వెంటనే పూర్తి చేయాలి



ఘట్‌కేసర్ రైల్వే వంతెన పనులు పూర్తిచేయాలి. ఏళ్లుగా కొనసాగుతున్న నిర్మాణ పనులతో అవస్థలు పడుతున్నాం. అసంపూర్తి పనులతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. గంటల తరబడి రోడ్డుపై వేచి ఉంటున్నాం. నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజల సమస్యను పరిష్కరించాలి.

- పాటి సురేందర్‌రెడ్డి, కొండాపూర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

పరిహారం చెల్లించాలి



పూర్వం నుంచి ప్రధాన రోడ్డు పక్కన ఇల్లు నిర్మించుకొని ఉంటున్నాం. చిరువ్యాపారం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాం. వంతెన పేరుతో రాత్రికి రాత్రి ఇళ్లు కూల్చి మమ్మల్ని రోడ్డున పడేశారు. ఉపాధి లేక, ఇల్లు కోల్పోయి దిక్కులేని వారిమయ్యాం. మాకు పరిహారం ఇచ్చి ఇంటి స్థలం కేటాయించాలి.

- బర్ల రాము, నిర్వాసితుడు

వంతెన నిర్మాణం పూర్తి చేయిస్తాం



ఘట్‌కేసర్ రైల్వే వంతెన నిర్మాణం పూర్తి చేయించేందుకు శ్రమిస్తున్నాం. ప్రజలు పడుతున్న ఇబ్బందులను మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్‌లకు వివరించాను. వారి సూచనలతో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించాం. దీంతో పనులు ప్రారంభం అయ్యాయి.

- ముల్లి పావని జంగయ్య, చైర్‌పర్సన్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

ఎమ్మెల్యే మల్లారెడ్డి అసమర్థతతోనే ..



ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడానికి అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే మాల్లారెడ్డి అసమర్థతే కారణం. ఐదేళ్లు మంత్రిగా ఉన్న అయన ఒక్క రైల్వే బ్రిడ్జిని కూడా పూర్తిచేయించకపోవడం విచారకరం. ఎన్నికల సమయంలో సొంత డబ్బుతో వంతెన నిర్మాణం చేయిస్తానని చెప్పి ఎన్నికల్లో గెలిచినా ఇప్పుడు పట్టించుకోవడం లేదు. మల్లారెడ్డిది అంతా ఎన్నికల స్టంటే!

- ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, ఘట్‌కేసర్

చెత్తదారి!

బషీరాబాద్, జూలై 28: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని రోడ్డుపై వ్యర్థాలు, చెత్తచెదారం పడేస్తున్నారు. ఈ మార్గంలో వాహనాలపై వెళ్తున్నప్పుడూ గాలిదూమరానికి చెత్తాచెదారం, ప్లాస్టిక్ కాగితాలు ఎగిరి కళ్లలో పడటంతో ఇబ్బందులు పడాల్సివస్తుందని స్థానికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడూ చెత్తను తరలించాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రత్యేకాధికారులు చొరవ చూపి వ్యర్థాలు రోడ్డుపై పారవేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బషీరాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని రోడ్డుపై చెత్తాచెదారం

వనమహోత్సవంలో భాగస్వాములవ్వాలి

పరిగి, జూలై 28: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే అన్నారు. పరిగి మునిసిపల్ పరిధిలోని నాల్గవ వార్డులో మనమహోత్సవం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి మొక్కలు నాటి, వాటిని పెంచే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, కమిషనర్ వెంకటయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంత్, పార్టీ మండల అధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పరిగి నాలుగో వార్డులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

విడుదల కాని
పాఠశాలల నిధులు
ప్రధానోపాధ్యాయులకు తప్పని తిప్పలు - 6లో

-7లో ఘనంగా
కొడి పీర్ల
ఉత్సవాలు



వర్షాకాలంలోనూ

నీటి కష్టాలు!



నీటి సరఫరా లేని తిరుమల రెసిడెన్సీ, ట్యాంకర్లతో నీళ్లు తెచ్చుకుంటున్న కాలనీ వాసులు



- పరిగి మున్సిపాలిటీ పరిధిలో కొన్ని ప్రాంతాలకు లేని తాగునీటి సరఫరా
- భగీరథ కనెక్షన్లు ఇవ్వని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న కాలనీల వాసులు
- పన్నులు చెల్లిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన

పరిగి, జూలై 28: ఇంటింటికీ మిషన్ భగీరథ కింద నల్లా కనెక్షన్ ఇస్తున్నామని అధికారులు చెబుతున్నా అచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. మిషన్ భగీరథ అధికారుల ఇష్టారాజ్యం, మునిసిపల్ అధికారుల అలసత్వం కారణంగా నీళ్ల కోసం పట్టణ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పరిగి మునిసిపల్ పరిధిలో పలు కాలనీల్లో వర్షకాలంలో కూడా తాగు నీటికి ఇబ్బందులు తప్పడం లేదు. మునిసిపల్ పరిధిలోని ఇప్పటికీ అసలు నీటి సరఫరా లేని కాలనీలు చాలానే ఉన్నాయి. తిరుమల రెసిడెన్సీ, భవానీనగర్, అనంతనగర్, మైత్రీనగర్‌లతో పాటు, తదితర కాలనీల్లో అసలు నీటి సరఫరా చేసే పైపులైన్లు లేవు. ఆయా కాలనీల్లోని కుటుంబాలు, జనాలంతా వ్యక్తిగత బోర్ల ద్వారానే గడుపుతున్నారు. మునిసిపల్‌కు అన్ని రకాలు పన్నులు చెల్లిస్తున్నా, నీటి వసతిని ఎందుకు కల్పించడం లేదని వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు బోర్లు కొంత మెరుగుపడినా, తిరిగి మళ్లీ తగ్గిపోతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి కొత్తకాలనీల్లో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్తకాలనీలో నీటిసరఫరా లేదు



కొత్త కాలనీలకు నీటి సరఫరా వసతి కల్పించడం లేదు. తిరుమల రెసిడెన్సిలో ఇళ్లు నిర్మించి నాలుగేళ్లు గడిచిపోయింది. ఇప్పటి వరకు మునిసిపల్ అధికారులు పైపు లైన్లు కూడా వేయలేదు. వ్యక్తిగత బోర్లతోనే కాలం గడపుతున్నాం. బోర్లలో నీరు తగ్గిపోయి ఇబ్బందులు పడుతున్నాం. రెగ్యులర్‌గా పన్నులు కడుతున్నాం. అధికారులు స్పందించి కొత్తగా వాటర్ ట్యాంకు, పైపులైన్‌లు వేసి సమస్యను తీర్చాలి. - నాగేశ్, తిరుమల రెసిడెన్సీ, పరిగి

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



పరిగి మునిసిపల్‌లో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. కొత్త కాలనీల్లో అమృత్-2 కింద పైపులైన్లు, ట్యాంకుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. సమస్య తీవ్రంగా ఉన్న కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం.

-వెంకటయ్య, మునిసిపల్ కమిషనర్,పరిగి

భూ సమస్య పరిష్కరించాలని.. సెల్‌టవర్ ఎక్కిన వ్యక్తి

పోలీసుల చొరవతో దిగిన తలకొండపల్లి మండలవాసి

తలకొండపల్లి, జూలై 28 : భూ సమస్యను పరిష్కరించాలని ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి హంగామా చేశాడు. సమస్య పరిష్కరించేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో అతడు టవర్ దిగాడు. వివరాల్లోకి వెళ్తే.. తలకొండపల్లి మండలం పూల్‌సింగ్ తండా పరిధి బూడియానాయక్ తండాకు చెందిన మేగవత్ సోమ్లా నాయక్ పొలం వద్ద దాయాదులతో ఉన్న భూ, బాట వివాదాన్ని పరిష్కరించాలని ఆదివారం తలకొండపల్లిలో ఉన్నత పాఠశాల వద్ద ఉన్న ఓ సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. తనకు న్యాయం చేసేంత వరకు టవర్ దిగనని భీష్మించాడు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో అక్కడికి చేరుకొని ఫోన్‌లో సోమ్లాతో మాట్లాడారు. తన భూ వివాదాన్ని పరిష్కరిస్తేనే దిగుతానని సోమ్లానాయక్ అనడంతో.. ఎస్సై నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. చివరకు అతడు టవర్ దిగాడు. అనంతరం సోమ్లానాయక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



సెల్‌టవర్‌పై సోమ్లానాయక్

విడుదల కాని పాఠశాల నిధులు

ప్రధానోపాధ్యాయులకు తప్పని తిప్పలు

మేడ్చల్, జూలై 28(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు నిధులు విడుదల కాకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు తిప్పలు తప్పడం లేదు. నిధులు ఉంటేనే ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహణ సాధ్యపడుతుంది. పాఠశాలల్లో అవసరమైన వస్తువులు కొనేందుకు ప్రభుత్వం ఏటా నిధులు విడుదల చేస్తుంది. కానీ ఈసారి మాత్రం ఇంత వరకు మంజూరు చేయలేదు. ప్రతీ విద్యా సంవత్సరంలో రెండుసార్లు నిర్వహణ నిధులు మంజూరు చేస్తుంది. 2024-25 విద్యాసంవత్సరం ప్రారంభమై నెలన్నర రోజులు దాటినా.. ఇంతవరకు నిధులు మంజూరు చేయలేదు. ఏటా జూలై మొదటి వారంలోనే మొదటి విడత నిధులను విద్యాశాఖ విడుదల చేసేది. ఈ ఏడాది ఇంత వరకు రాకపోవడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బులు వెచ్చించి ఇబ్బంది పడుతున్నారు. నిధుల విడుదలకు ఎదురుచూస్తు న్నారు. జిల్లాలో 375 ప్రాథమిక పాఠశాలలు, 22 ప్రాథమికోన్నత పాఠశాలలు, 108 ఉన్నత పాఠశాలలు, 10 ఎయిడెడ్ పాఠశాలలు మొత్తం 515 పాఠశాలలున్నాయి. తరగతి గదుల నిర్వహణకు హాజరు రిజిస్టర్, విద్యుత్ బిల్లులు, తాగునీరు, చిన్న మరమ్మతులు, చాక్‌పీసులు, ప్రయోగశాలలకు అవసరమైన సామగ్రి, పాఠశాలల్లో ఇతర అవసరాలకు డబ్బులు కావాలి. అదేవిధంగా పరీక్షల నిర్వహణ, జాతీయ పండుగల నిర్వహణకు వినియోగించాల్సి ఉంటుంది. వీటిని పాఠశాలలకు వచ్చే నిధుల నుంచే కొనుగోలు చేయాలి. గత సంవత్సరం మొదటి విడత తొందరగా విడుదల చేసినా రెండో విడత మాత్రం మార్చిలో ఇచ్చి వెంటనే ఖర్చు చేయాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో ప్రధానోపాధ్యాయులు ఆగమేఘాల మీద వాటి లెక్కలు సమర్పించారు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు అందిస్తుంది. విద్యార్థుల సంఖ్య 1-30 వరకు ఉంటే రూ.10వేలు, 31-100లోపు ఉంటే రూ.25వేలు, 101-250 వరకు ఉంటే రూ.50వేలు, 251-1000 వరకు ఉంటే రూ.75 వేల చొప్పున సంవత్సరానికి మంజూరు చేస్తుంది. వెయ్యి మంది కంటే ఎక్కువగా ఉంటే రూ.లక్ష వరకు వస్తాయి.

లేని క్రీడా పరికరాలు..

ప్రతీ పాఠశాలలకు క్రీడల నిధులు రావాల్సి ఉంది. ఆయా పాఠశాలల్లో పీడీలు, పీఈటీలు ఉన్నా వివిధ రకాల ఆటలు ఆడించేందుకు చాలా చోట్ల పరికరాలు లేవు. క్రీడల నిర్వహణకు ఇంత వరకు నిధులు ఇవ్వలేదు. వచ్చే ఆగస్టు నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటలు జరుగనున్నాయి. వాటిలో పాల్గొనాలంటే విద్యార్థులకు శిక్షణ అవసరం. చాలా పాఠశాలల్లో గ్రామస్తులు, యువజన సంఘాల వారు, ప్రజా ప్రతినిధులు క్రీడా పరికరాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. అదే ప్రభుత్వం ఇస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.



గౌడవెల్లి ప్రభుత్వ పాఠశాల

త్వరలోనే నిధుల విడుదల



స్కూల్ గ్రాంట్స్ త్వరలోనే విడుదలయ్యే అవకాశముంది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అప్పటి వరకు ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి.

- విజయకుమారి, జిల్లా విద్యాధికారి

మానవాళి మనుగడకు చెట్లే ఆధారం



అర్బన్ ఫారెస్ట్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్, జూలై 28: భవిష్యత్తులో మానవాళి మనుగడకు చెట్లే ఆధారమని, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం శివారులో ఉన్న అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పూర్తిగా సహకరించినప్పుడే వన మహోత్సవం విజయవంతమౌతుందన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామాలకు మొక్కల పంపిణీ సక్రమంగా జరిగేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమంలో కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత, ఫారెస్ట్ అధికారులు రవీందర్‌గౌడ్, అజీజ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంజుల



చేవెళ్ల, జూలై 28 : నిరంతరం మహిళల హక్కుల కోసం పోరాటం చేస్తూ పేదల పక్షాన నిలబడే నిఖార్సైన చేవెళ్ల మండల మహిళ నాయకురాలు వడ్ల మంజుల.. భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం చేవెళ్లలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం పోరాటం చేస్తామన్నారు. తనపై నమ్మకంతో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పార్టీ పెద్దలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, సత్యనారాయణ, సత్తిరెడ్డి, మక్బూల్, శివయ్య, అంజయ్య, సుధాకర్‌గౌడ్ తదితరులు హర్షం వ్యక్తం చేసి మంజులకు శుభాకాంక్షలు తెలిపారు.



చెల్మారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోదండరాం

రంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో స్థానికులకు వాటా ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం, జూలై 28 : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రంగారెడ్డి జిల్లాకు అస్తిత్వం లేకుండా చేశారని, జిల్లా అభివృద్ధిలో స్థానిక ప్రజలకు వాటా ఇచ్చినప్పుడే అభివృద్ధిలోకి వస్తుందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరాం అన్నారు. రంగారెడ్డి జిల్లాతో హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్ వ్యాపారులే బాగుపడ్డారని, ప్రజల బతుకుల్లో ఆశించినంత మార్పు రాలేదన్నారు. గతంలో తెలంగాణ జేఏసీ జిల్లా కన్వీనర్‌గా ఉన్న వెదిరె చెల్మారెడ్డి ప్రథమ వర్ధంతి సభ ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని భారత్ గార్డెన్స్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి కోదండరాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత పాలనలో ఉద్యమకారులకు న్యాయం జగరలేదని, ఈ ప్రభుత్వంలోనైనా న్యాయం జరిగేట్లు చూడాలని పలువురు వక్తలుచేసిన ప్రస్తావనకు ఉద్యమకారులు సంఘటితంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించుకుంటామన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను ఒక పుస్తకంలా తేవాల్సిన అవసరముందన్నారు. ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన చెల్మారెడ్డి విగ్రహం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానంటూ చెప్పారు.

స్థానిక సమరానికి అడుగులు

- కసరత్తును ప్రారంభించిన ఎన్నికల సంఘం
- ఆగస్టు 3న ఎంసీహెచ్ ఆర్‌డీలో వర్క్ షాప్
- ఆగస్టు 5 నుంచి ఓటర్ల గుర్తింపు ప్రక్రియ



తాండూరు, జూలై 28: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అడుగులు పడ్డాయి. సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించిన 24గంటల్లోనే ప్రక్రియకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. నిర్దిష్ట కాల పరిమితిని నిర్దేశించి ప్రక్రియను చేపట్టేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఓటర్ల జాబితా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఓటర్ల వివరాలు సేకరించేందుకు అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆపరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఎన్నిలక సంఘం కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు (డీపీవో)కు సూచిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ పంచాయతీ 2వ సాధారణ ఎన్నికలు-2024 ఎలక్టోరల్స్‌కు అవసరమైన ఐదుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు లేదా ప్రతీ జిల్లా నుంచి టీవోటీలుగా నియమించాలని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వార్డుల వారీగా ఎన్నికల మ్యాపింగ్‌పై శిక్షణ ఇవ్వడానికి గ్రామ పంచాయతీ ఏసీఈఆర్‌లను స్వీకరించడానికి అధికారులు, సిబ్బందిని నియమించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. తాజా అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలను వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా మ్యాపింగ్‌పై డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణను ఇవ్వాలని నిర్ణయించారు. హైదరాబాద్ నగరంలోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో ఒకరోజు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. ఆగస్టు 3న ఉదయం 10-30 గంటల నుంచి మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ఐదుగురి చొప్పున డేటా ఆపరేటర్లకు, శిక్షకులకు వర్క్‌షాపులో ఓటర్ల జాబితాపై శిక్షణ ఇస్తారు. శిక్షణకు హాజరయ్యే ఆపరేటర్లు, శిక్షకుల పేర్లను ఈనెల 31వ తేదీలోపు అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వాస్తవానికి గతంలోనే ఏర్పాట్లు

గతేడాది డిసెంబర్‌లోనే సర్పంచ్ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. 200 మంది ఓటర్లుకు ప్రిసైడింగ్ అధికారితో పాటు పోలింగ్ అధికారి ఉంటారు. 201-400 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401-650 వరకు ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు. 650 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉంటే అదనపు పోలీంగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు.

బ్యాలెట్ బాక్స్‌ల వివరాల సేకరణ



పార్లమెంటు ఎన్నికల ముందే ఎన్నికల సంఘం బ్యాలెట్ బాక్స్‌ల వివరాలు, కావాల్సిన సిబ్బంది వివరాలను సేకరించిన విషయం విధితమే. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ వేగవతం కావడంతో మరిన్న వివరాలను సేకరిస్తారు.

తాండూరు సబ్ డివిజన్‌లో 267 పంచాయతీలు

తాండూరు సబ్‌డివిజన్ పరిధిలోనితాండూరు, కొడంగల్ నియోజకవర్గాలకు సంబంధించి 267గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కోట్‌పల్లిలో 18, తాండూరులో 33, పెద్దేముల్‌లో 37, యాలాలలో 37, బషీరాబాద్‌లో 36, కొడంగల్ 26, బొంరాస్‌పేట్‌లో 47, దౌల్తాబాద్‌లో 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

రిజర్వేషన్లపై సందిగ్ధతకు తెర



కులగణన తర్వాత ఎన్నికల వేళ ఓటర్ల జాబితా ఆధారంగా రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టాలన్న సందిగ్ధతకు తెరపడింది. ఓటర్ల జాబితా ప్రాతిపదికన పంచాయతీరాజ్ శాఖను నోడల్ ఏజెన్సీగా నియమించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఓటర్ల వివరాలు సేకరించాలని నిర్ణయిస్తూ బీసీ కమిషన్ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పాత రిజర్వేషన్లే ఉంటాయన్నది స్పష్టమవుతోంది. ఆగస్టు 5వ తేదీ తర్వాత ఓటర్ల జాబితా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ ఓబీసీల వివరాల సేకరణ ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. వార్డుల వారీగా ఈ ప్రక్రియ కొనసాగుతుందని పంచాయతీరాజ్ శాఖ అధికారికి ఒకరు చెప్పారు.

ఘనంగా కౌడి పీర్ల ఉత్సవాలు



అక్నాపూర్‌లో పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్థులు

నవాబుపేట, జూలై 28: మండలంలోని అక్నాపూర్ గ్రామంలో కౌడి పీర్ల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కులమతాలకతీతంగా ప్రజలు పీర్ల ఉత్సవాల్లో పాల్గొన్నారు. విద్య మౌలిక వసతుల మాజీ చైర్మన్ జి.నాగేందర్‌గౌడ్ ఉత్సవాల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. గ్రామంలోని పురవీధుల మీదుగా పీర్ల ఊరేగింపుతో సమీప చెరువుల్లో పీర్లను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావలి స్వరూప భీమయ్య, మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు మల్లేశ్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు నల్లోల్ల యాదగిరి, సంతోష్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింహులు, గోపాల్, మాణిక్యం, రజాక్, ఖాజ మీయ, మోయిన్, మన్సూర్ అలీ, షబ్బీర్ పాల్గొన్నారు.

పూడూరు వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న సయ్యద్ ఆదిల్ అహ్మద్

పూడూరు, జూలై 28: గ్లోబల్ హ్యూమన్ పీస్ ఇంటర్‌నేషనల్ వర్చువల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పీపుల్ ఫోరం ఆఫ్ ఇండియా భారత్ సేవక్ సమాజ్ వారు వివిధ రంగాలతోపాటు సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలందిస్తున్న వారిని గుర్తించింది. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని మన్నెగూడకు చెందిన ఆదిల్ గ్రూప్స్ చైర్మన్ సయ్యద్ ఆదిల్‌అహ్మద్ సామాజిక సేవారంగంలో విశిష్ట సేవలను గుర్తించి సయ్యద్ ఆదిల్ అహ్మద్‌కు గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఈ మేరకు ఆదివారం గ్లోబల్ హ్యూమన్ పీస్ ఇంటర్‌నేషనల్ వర్చువల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పీపుల్ ఫోరం ఆఫ్ ఇండియా భారత్ సేవక్ సమాజ్ వారు ఢిల్లీలోని శ్రీసత్య సాయి ఆడిటోరియంలో నిర్వహించిన డాక్టరేట్ ప్రధానోత్సవంలో ఆదిల్ అహ్మద్ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు డాక్టర్ మానుఏల్, వరల్డ్ పీస్ ఇనిస్టిట్యూట్ యునైటెడ్ నేషనల్ ఫౌండర్ పర్వీందర్‌సింగ్, తమిళనాడు స్పెషల్ కమిషనర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఐఏఎస్ సంపత్‌కుమార్ చేతుల మీదుగా ఈ పట్టాను అందుకున్నారు. ఆయన డాక్టరేట్ పట్టాతో పాటు జాతీయ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును అందుకున్నారు. ఆదిల్ అహ్మద్ డాక్టరేట్ పట్టా అందుకోవడంతో వికారాబాద్ జిల్లాతో పాటు పూడూరు మండల, మన్నెగూడ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ముదిరాజ్ సంఘం అభివృద్ధికి సహకారం

తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్



జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

చేవెళ్ల, జూలై 28 : ముదిరాజ్ సంఘం అభివృద్ధికి నిరంతరం తోడ్పటునందిస్తామని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ తెలిపారు. ఆదివారం చేవెళ్ల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఊరడి నర్సింలు ముదిరాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జ్ఞానేశ్వర్‌ను ఆయన నివాసంలో నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ ముదిరాజ్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ముదిరాజ్ సంఘాలను అన్ని గ్రామాల్లో బలోపేతం చేసి అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంతో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శులు చామంతి శివారాజ్, శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గోపాల్, నాయకులు సునిగంటి శ్రీకాంత్, గణేశ్, వెంకటేశ్, కృష్ణమోహన్, మల్లేశ్, కుమార్, రాము, భిక్షపతి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ చేయూత



విద్యార్థులకు సామగ్రిని అందజేస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

ఆమనగల్లు, జూలై 28: అనాథ ఆశ్రమ విద్యార్థులకు ఆమనగల్లు లయన్స్ క్లబ్ చేయూతనందించింది. రూ. 60వేల వస్తు సామగ్రిని సమకూర్చి ఆదివారం అందజేసింది. సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, హైదరాబాద్ సెంచరీయల్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ చంపాపేట్ వైదేహి ఆశ్రమానికి చెందిన 75 మంది విద్యార్థులకు, కారుణ్య సింధు ఆశ్రమానికి చెందిన 25 మంది విద్యార్థులకు దుప్పట్లు, పుస్తకాలు, నిత్యావసర సరుకులు సమకూర్చారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా వందమంది విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృద్ధులు, అనాథలు, నిరుపేదలకు లయన్స్‌క్లబ్ అండగా నిలుస్తుందని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్లు జూలూరి రమేశ్, కసిరెడ్డి రాంరెడ్డి, బండెల రాంచంద్రారెడ్డి, పీఆర్‌వో ఎం.ఏ పాష ఆశ్రమ నిర్వాహకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల హక్కుల సాధనకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అరవింద్‌రావు

పరిగి, జూలై 28: బ్రాహ్మణుల హక్కుల సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని బ్రాహ్మణసేవా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కె.అరవింద్‌రావు అన్నారు. పరిగిలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఆదివారం జిల్లా కార్యవర్గ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బ్రాహ్మణులు వెనుకబడి పోతున్నారని అన్నారు. బ్రాహ్మణుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించి వారి సంక్షేమానికి ఖర్చు చేయాలని కోరారు. బ్రాహ్మణులంతా ఒక్కతాటిపైకి వస్తే సమస్యలను పరిష్కరించుకోవడం సులభంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసమితి రాష్ట్ర నాయకులు సిద్ధాంతి పార్థసారథి, ప్రహ్లాద్‌రావు, పురుషోత్తమ్‌రావు, జిల్లా కార్యదర్శి దత్తాత్రాయ, పరిగి తాలుకా అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి జోషి శ్రీకాంత్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లను స్థానికులకే ఇవ్వాలి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 28: ఘట్‌కేసర్ మండలంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానికులకే ఇవ్వాలని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం వెంకటాపూర్‌లోని డబుల్ బెడ్‌రూంల ఇళ్లను సందర్శించారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ.. మండలంలో ప్రతాప్‌సింగారం, వెంకటాపూర్ గ్రామాల్లో డబుల్‌బెడ్ రూంల ఇళ్లను నిర్మించిందని, ఈఇళ్లు స్థానికులకు కాకుండా నగరంలో ఉండే వారికి గత ప్రభుత్వం కేటాయించిందన్నారు. కానీ స్థానికులకు ఇవ్వకుండా నగరవాసులకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఘట్‌కేసర్ మండలంలో అర్హులైన ఇళ్లులేని పేదలకు డబుల్‌బెడ్ రూంల ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

జింకపై శునకాల దాడి

కాపాడి ఆస్పత్రికి చేర్చిన మాజీ సర్పంచ్



యాచారం, జూలై 28: నందివనపర్తిలో పొలంలో మేత మేస్తున్న జింకపై కుక్కలు దాడి చేసి కరిచాయి. ఆదివారం మధ్యాహ్నం మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్ పొలం వద్ద కుక్కలు జింకను చంపి తినేందుకు యత్నించాయి. అది చూసిన విజయ్‌కుమార్ కుక్కలను తరిమి గాయపడ్డ జింకను తన కారులో యాచారంలోని ప్రభుత్వాసుపత్రికి తెచ్చి ప్రథమ చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు జింకను నగరంలోని జూపార్క్‌కు తరలించారు. జూ వైద్యులు జింకకు చికిత్స చేస్తున్నారని ఆయన తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి సేవలు మరువలేనివి



పంచాయతీ కార్యదర్శి శేఖర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కేశంపేట, జూలై 28: మండల పరిధిలోని చింతకుంటపల్లి పంచాయతీ కార్యదర్శి శేఖర్ సేవలు మరువలేనివని అనేమోని బ్రదర్స్ పారేశ్, కృష్ణ అన్నారు. బదిలీపై వెళ్తున్న శేఖర్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన చింతకుంటపల్లి గ్రామ పంచాయతీకి కార్యదర్శి శేఖర్ తనవంతుగా ఎంతో కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పద్మ, రఘుమారెడ్డి, పద్మమ్మ, గిరిజ, పాఠశాల చైర్మన్ అనేమోని రాధ తదితరులు పాల్గొన్నారు.

కురుమల సమస్యను అసెంబ్లీలో చర్చిస్తా



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న కురుమ సంఘం నాయకులు

తాండూరు, జూలై 28: కరుమ సామాజిక వర్గానికి తప్పుడు ధ్రువపత్రాల విషయమై జరుగుతున్న అన్యాయంపై అసెంబ్లీలో లేవనెత్తుతానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు క్యాంపు కార్యాలయంలో కురుమ సంఘం తాండూరు డివిజన్ ప్రతినిధుల బృందం ఆదివారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తమకు బీసీ-బీ సీరియల్ నెంబర్-11 ప్రకారం కురుమ అని తప్పుడు కులం సర్టిఫికెట్ ఇస్తున్నారని తెలిపారు. అధికారులతో చర్చించి మాదిసి కరుమ, మాదారి కరుమ కులం సర్టిఫికెట్లను ఇప్పించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా అసెంబ్లీలో చర్చించి రాజ్యాంగం ప్రకారంగా గెజిట్ నెం-30 ప్రకారం రావాల్సిన మాదాసి కురుమ కుల సర్టిఫికెట్లు ఇచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కురువ సంఘం ఉపాధ్యక్షుడు పూజారి పాండు, కార్యదర్శి ఇందూరు మల్లేశం, జిన్‌గుర్తి నర్సింహులు, పల్లె వెంకటయ్య, హనుమయ్య, కందనెల్లి రాఘవేందర్ (రఘు), మంబాపూర్ రాజు, సాయిపూర్ తుల్జప్ప, కొత్తూరు బాలప్పలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయమైన 'ప్రజాభవన్'లో ఆదివారం వినతులను స్వీకరించారు. వినతిపత్రాల ద్వారా స్వయం చెపుకున్న వారి వివరాలను విన్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కాలనీల సమస్యల, వ్యక్తిగత సమస్యలను పలువురు ఎమ్మెల్యేకు వివరించారు. వర్షాకాలంలో కాలనీల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

ఎమ్మెల్యే పరామర్శ

తాండూరు రూరల్: మండలంలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జర్నె నాగప్ప గుండెపోటుతో కొంత కాలంగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆయన ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ చేసుకుని ప్రస్తుతం తన స్వగ్రామంలోని ఇంటికి చేరుకున్నారు. కాంగ్రెస్ నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న తాండూరు ఎమ్మెల్యే ఆదివారం గౌతాపూర్‌లోని నాగప్ప ఇంటికి వెళ్లారు. ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు.అంతకుముందు నాగప్ప హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు సాయిపూర్ బాల్‌రెడ్డి, నర్సింహులు తదితరులున్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తతే ముఖ్యం

ముందస్తు చర్యలు తప్పనిసరి



రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

చేవెళ్ల, జూలై 28 : సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున జూన్ నుంచి ఐదు నెలలపాటు అప్రమత్తంగా ఉంటూ పరిశుభ్రత పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. వానకాలంలో వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఆ తర్వాత వచ్చే చలికాలంలో మరింత అప్రమత్తత అవసరమని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. వైద్య, పంచాయతీ శాఖల సమన్వయంతో వ్యాధుల కట్టడికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గ్రామాలు, పట్టణాల్లో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాల్సి అవసరం ఉంది. నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, మురికి కాలువను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. దోమలు కుట్టిన వెంటనే జ్వరం, కండరాలు నొప్పులు, వాంతులు దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయని, రక్త కణాలు తగ్గి ప్రాణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వైద్యులు తెలుపుతున్నారు. సాధారణ జ్వరాల పట్ల ప్రజలు జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని, పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, జలుబు, దగ్గు, ఆయాసం, శక్తిని కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెబుతున్నారు.

స్వైన్ ఫ్లూతో జాగ్రత్త

అక్టోబరు నుంచి మార్చి వరకు స్వైన్ ఫ్లూ కేసులు ఎక్కువగా నమోదవుతుంటాయి. వైరస్ శ్వాసకోశ వ్యవస్థపై దాడి చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుందని, స్వైన్‌ఫ్లూ సోకకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. లక్షణాలు ఉంటే వెంటనే టెస్టులు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

ఇలా చేస్తే మేలు

నీటి నిల్వ గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయడంతో దోమలు లార్వాను నియంత్రించవచ్చు. మురుగు కాల్వల్లో పూడికతీత పనులతో పాటు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. కాలువల్లో రసాయన మందు పిచికారీ చేయాలి. ప్రధాన ప్రాంతాల్లో, అంతర్గత కాలనీల్లో నిత్యం బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. వార్డుల వారీగా పారిశుధ్య చర్యలపై వివరాలను కార్యాలయాల్లో నమోదు చేయాలి. మురుగు వాడల్లో శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తరచూ వైద్య, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలి.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఎవరికి వారుగా ఆరోగ్య సూత్రాలు పాటించడం ఉత్తమం. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి.

- డాక్టర్ దామోదర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, చేవెళ్ల



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

పరిగి, జూలై 28: పరిగి మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని మునిసిపల్‌లో ఆదివారం 55మంది బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మునిసిపల్ అధికారులు, కౌన్సిలర్లతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇప్పటికే పరిగి మునిసిపల్ అభివృద్ధికి ప్రత్యేక నిధుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పరిగి పట్టణంలో ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మాణానికి డిజైనింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలతో త్వరలో సమావేశం నిర్వహించి సూచనలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, కమిషనర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరశైవలింగాయత్ భవనానికి నిధులివ్వండి

ఎరిగిలో వీరశైవలింగాయత్ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు ఇవ్వాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పరిగి ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సంఘం వీరశైవలింగాయత్ తాలుకా అధ్యక్షకార్యదర్శులు గాండ్ల శివరాజు, మల్లేశంలు మాట్లాడుతూ, పరిగిలో రుద్రభూమి కోసం స్థలం కేటాయించాలని కోరారు. అన్ని దేవాయాల కమిటీల్లో ప్రత్యేక స్థానం కల్పించాలని కోరారు. పరిగి నుంచి శ్రీశైలం క్షేత్రానికి నిత్యం ఆర్టీసీ బస్సును నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు లింగప్ప, భద్రప్ప, నాగేశ్ తదితరులు ఉన్నారు.

పూడూరు: ప్రభుత్వం పేదలకు అన్ని విధాల తోడుగా ఉంటుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులకు ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. చింతలపల్లికి చెందిన ప్రమీలకు రూ.54వేలు, మరాఠి పెంటయ్యకు రూ.8500ల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో అనేక జబ్బులకు ఉచితంగానే ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, మాధుసూదన్‌రెడ్డి, నరేందర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు నాగలి బహూకరిస్తున్న నాయకులు

కల్వకుర్తి నియోజకవర్గానికి సీఎం వరాల జల్లు

- ఐదో పేజీ తరువాయి..

తెలంగాణలో ప్రజలు దొరలు, కుటుంబ పాలనను దించి, కాంగ్రెస్సే ప్రజస్వామ్యాన్ని కాపాడుతుందని అధికారం ఇచ్చారని అన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ఈ ప్రాంత దశ దిశ మారనుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎనుముల రేంత్‌రెడ్డిని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారయణరెడ్డి కోరారు. ఎంపీ మల్లురవి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కల్వకుర్తి పేరును ప్రపంచ వ్యాప్తంగా గుర్తుచేసిన జైపాల్‌రెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మాడ్గుల మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొండల్‌రెడ్డి, సాయిరెడ్డిలు సీఎంకు నాగలి బహూకరించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఏర్పాటుకు స్థల పరిశీలన

కల్వకుర్తిలో కార్యక్రమాన్ని ముగించుకొని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం సాయంత్రం కందుకూరు మండలం మీర్కాన్‌పేట వద్ద వృత్తి విద్య నైపుణ్య యూనివర్సిటీ కోసం గుర్తించిన స్థలాన్ని పరిశీలించారు. సర్వే నంబరు 112లోని 57 ఎకరాల ప్రభుత్వ భూమిని యునివర్సిటీ కోసం అధికారులు గుర్తించారు. సీఎం భూముల మ్యాప్‌ను పరిశీలించి ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు.



షాద్‌నగర్‌అర్బన్:మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

మన్‌కీ బాత్‌ను వీక్షించిన నాయకులు

షాద్‌నగర్ అర్బన్/చౌదరిగూడ/కొందుర్గు/కేశంపేట, జూలై 28: ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించిన మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు వీక్షించారు. బీజేపీ షాద్‌నగర్ లీగల్ సెల్ అధ్యక్షుడు శ్యాంసుందర్ ఆధ్వర్యంలో మన్‌కీబాత్ కార్యక్రమాన్ని తిలకించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, నాయకులు శేరి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎం.మురళి, వంశీకృష్ణ, కోరమోని హరి భూషణ్‌పటేల్, రాము, విజయ్‌కుమార్, రంగన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలోని మండలాధ్యక్షుడు శ్రీశైలం నివాసంలో బీజేపీ నాయకులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించారు. వెంకటేష్ గుప్త, లక్ష్మీకాంత్‌రెడ్డి, మాణెమ్మ, సత్యమ్మ, అంజమ్మ, శరణ్ భరద్వాజ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మన్‌కీ బాత్ ప్రజలకు మరింత చేరువైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కేశంపేట మండల కేంద్రంలో ఆయన కార్యక్రమాన్ని వీక్షించారు. బీజేపీ మండలాధ్యక్షుడు రొల్ల రఘురాములుగౌడ్, నాయకులు కంచుకోల నర్సింహ, ఐలయ్య, శివాజీ, పాండురంగారెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్, రమేష్, నరేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మహేందర్, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్: బోనాల వేడుకల్లో స్థానికులు


ధారూరు: ధారూరులో మైసమ్మ ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు


కొడంగల్ రూరల్: పర్సాపూర్‌లో బోనాలు తీసుకువెళ్తున్న మహిళలు


కీసర: చీర్యాల్‌లో గ్రామదేవతకు బోనాలు సమర్పిస్తున్న మాజీ ఎంపీపీ మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ


కొడంగల్: ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్న ముదిరాజ్ సంఘం నాయకులు

వైభవంగా బోనాలు


కీసర రూరల్: బోనాల ఉత్సవాల్లో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే మల్లారెడ్డి

వికారాబాద్, జూలై 28: ఆషాఢ మాస బోనాల సందర్భంగా వికారాబాద్‌లోని శివరాంనగర్, ఇంద్రానగర్ కాలనీలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. శివరాంనగర్ కాలనీలో అమ్మవారికి కౌన్సిలర్ నవీన్, ఇంద్రానగర్ కాలనీలో కౌన్సిలర్ బొండల సువర్ణ బోనాలు సమర్పించారు. ఇంద్రానగర్ కాలనీ వాసులు ఇంద్రానగర్ నుంచి కొత్తగంజ్‌లోని ఎల్లమ్మ ఆలయం వరకు ర్యాలీగా వెళ్లి పోతురాజు విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, గౌడకులస్తుల గట్టంతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ వేడుకల్లో కాలనీపెద్దలు బొండల శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్, బొండల శేఖర్, బొండల మల్లి, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ధారూరు: మండలంలో మైసమ్మకు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. తమను చల్లంగా చూడాలని, వర్షాలు బాగా కురిపించాలని, పాడిపంటలు సమృద్ధిగా పండేలా చూడాలని మహిళలు అమ్మవారిని మొక్కుకున్నారు.

మోమిన్‌పేట్: మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామంలో గ్రామ దేవత పోచమ్మ, ఊరడమ్మ బోనాలను నిర్వహించారు. గొల్ల కురుమ సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో ప్రత్యేక నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, మాజీ సర్పంచ్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మనెయ్యయాదవ్, మానెయ్య గొల్ల రాజేందర్, పెద్ద గొల్ల మల్లయ్య, గొల్ల దినేశ్, పట్లోళ్ల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆషాఢ మాసం బోనాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారి ఆలయాలను అలంకరించి మధ్యాహ్నం సమయంలో డప్పుల చప్పుళ్ల, శివసత్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాల మధ్య గ్రామ దేవతలకు మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు.

తాండూరు: పట్టణంలో ప్రసిద్ధ అమ్మవారి ఆలయమైన కాళికాదేవి అమ్మవారికి, ఆదర్శనగర్ కట్టమైసమ్మ, గాంధీనగర్‌లోని కట్ట మైసమ్మ, మల్‌రెడ్డిపల్లిలోని పోచమ్మ, సాయిపూర్ కట్టమైసమ్మ దేవతలను ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అలకరించారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదర్శనగర్ కట్టమైసమ్మ, కాళికా దేవి, మల్‌రెడ్డిపల్లి పోచమ్మ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆర్‌టీపీపీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీ కృష్ణగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, కౌన్సిలర్లు నీరజా బల్‌రెడ్డి, సాహు శ్రీలత, బాలప్ప, ప్రభాకర్‌గౌడ్, పట్లోళ్ల నర్సింహులు, సాయిపూర్ వేణు, పి.బస్వరాజ్, భద్రేశ్వర్‌లు పాల్గొన్నారు. గాంధీనగర్ అమ్మవారి ఆలయంలో కౌన్సిలర్ సంగీత ఠాకూర్ ఆధ్వర్యంలో మైసమ్మ మాతకు మహిళలు అభిషేకం చేసి నైవేద్యాలను సమర్పించారు. కాళికా దేవి బోనాల జాతర ఉత్సవాలలో బీసీ సంఘం నాయకులు రాజ్‌కుమార్, ఈవో నరేందర్, నాయకులు రాము, ఆదర్శనగర్ కట్ట మైసమ్మకు ఆర్టీపీఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళికాదేవి, కట్ట మైసమ్మ దేవాలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. కాళికాదేవి ఆలయంలో ఎమ్మెల్యే బ్రదర్స్‌ను సన్మానించారు. మల్‌రెడ్డిపల్లిలోని పోచమ్మ ఆలయాల్లో బీజేపీ కౌన్సిలర్లు సాహు శ్రీలత, బాలప్పల ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, పాల్గొన్నారు.

బషీరాబాద్: మండల కేంద్రంలోని శ్రీ పోచమ్మ, రేణుకఎల్లమ్మ ఆలయాల్లో ఆదివారం ఆషాఢ బోనాల ఉత్సవాలకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరై స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావు తనయుడు ఎం.రోహిత్ మహారాజ్ ఆధ్వర్యంలో ఉదయం 9గంటలకు ఆలయంలో శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణం భక్తజనుల మధ్య కనుల పండువగా జరిగింది. సాయంత్రం 4గంటలకు మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవార్లకు బోనాలు సమర్పించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీమణి శీలాదేవి, కోడలు నవ్యశ్రీ, బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, మాజీ జడ్పీటీసీలు మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.రాకేష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేష్, రామునాయక్, పవన్‌ఠాగూర్, సాయిల్‌గౌడ్, సిద్ధార్థ పాల్గొన్నారు.


మర్పల్లి: అమ్మవారి వేషాధారణలో చిన్నారి

తాండూరు రూరల్: మండలంలోని ఖాంజాపూర్‌లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రేగడి మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు రెండు కిలోమీటర్ల మేర ఊరేగింపుగా బోనాలతో ఆలయానికి తరలివచ్చారు. బోనాలతో ఐదు ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత, న్యాయవాది సుధాకర్, మాజీ ఉపసర్పంచ్ రమేష్, యువ నాయకులు మద్దూరు వెంకటేష్, వెంకటయ్య, రవీందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నారాయణ, నర్సింహులు పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని సయ్యద్‌మల్కాపూర్‌లో ఆదివారం మైసమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. మైసమ్మ అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు.

కొడంగల్: పట్టణంలో పెద్దమ్మ తల్లి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తెలంగ్‌వాడీ వీధి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ఫలహార బండి ఊరేగించారు. ముదిరాజ్ సోదరులు పెద్దమ్మ తల్లికి బోనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఫలహారం బండి ఊరేగింపు ముందు పోతురాజుల విన్యాసాలు, డప్పుల దరువులు, యువత కేరింతలు, వివిధ వేషాధారణలు, కళాకారుల ప్రదర్శనలు, నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: మండలంలోని పర్సాపూర్ గ్రామంలో ఆదివారం గ్రామ దేవత ఊరడమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామంలోని పురవీధుల మీదుగా ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

దోమ: మండలంలోని మోత్కూర్ గ్రామంలో కట్ట మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దోమ నర్సిములు, సతీశ్, సారంగి, చంద్రయ్య, వెంకటయ్య, హనుమంతు, చెన్నయ్య, శివకుమార్, అంజనేయులు, కృష్ణ, నరేశ్, అంజి, పెద్ద నర్సింహులు, భాగ్యమ్మ, సుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: దేవరఫస్లాబాద్ గ్రామంలో ఆషాఢ బోనాలను పురస్కరించుకొని ఊరడమ్మ దేవతకు గ్రామస్థులు బోనాలు ఘనంగా నిర్వహించారు. పసుపు, గంధం, పూలు తదితర వాటితో మహిళలు అమ్మవారికి బోనాలతో ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

కీసర: మండల పరిధి చీర్యాల్, కరీంగూడ, నర్సంపల్లి, వన్నీగూడెం, తిమ్మాయిపల్లి గ్రామాలల్లో ప్రజలు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో మహిళలు గ్రామదేవతలకు ప్రీతికరమైన బోనాలను సమర్పించగా, మరికొంత మంది భక్తులు డప్పుదరువుల నడుమ శివసత్తులతో, పోతురాజులతో తొట్టేల ఊరేగింపులు నిర్వహించారు.

కీసర రూరల్: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల ప్రజలు ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను రంగులతో, విద్యుద్దీపాలతో పచ్చటి తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలుసమర్పించారు. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆహ్వానం మేరకు నాగారంలో నిర్వహించిన బోనాల వేడుకలకు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి విచ్చేసారు. చంద్రారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి మహంకాళి అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత స్థానికంగా ఉన్న పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని, బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గూడూరు ఆంజయ్యగౌడ్, జగన్మోహన్‌రెడ్డి, తేళ్ల శ్రీధర్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్ .చందుపట్లగూడ, బొక్కోనిగూడ, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడలలో బోనాల పండుగ సందర్భంగా గ్రామదేవతలు ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులు ఉదయం నుండే అమ్మవార్లలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. శివసత్తులు తలపై బోనాలతో పూనకంతో ఊగిపోతు నృత్యాలు చేశారు. రాత్రి ఫలహారం బండ్లతో ఊరేగింపులు నిర్వహించారు. ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, పోచారం మున్సిపాలిటీ ఇస్మాయిల్‌ఖాన్‌గూడలోనూ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి స్థానిక కౌన్సిలర్‌తో కలిసి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు


తాండూరు: కాళికాదేవి బోనాల జాతరలో అమ్మవారికి ప్రత్యేకపూజలు


తాండూరు రూరల్: ఖాంజాపూర్‌లో రేగడి మైసమ్మకు బోనాలతో తరలివెళుతున్న మహిళలు

మోమిన్‌పేట్: మొరంగపల్లిలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్థులు




బషీరాబాద్: శ్రీపోచమ్మ, రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నాయకులు


ఘట్‌కేసర్: ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో అమ్మవారిని దర్శించుకున్న పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి


దోమ: మోత్కూర్ కట్ట మైసమ్మను దర్శించుకున్న కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ


పరిగి: సయ్యద్‌మల్కాపూర్‌లో బోనంతో బాలిక


ఘట్‌కేసర్: మున్సిపాలిటీ బొక్కోనిగూడలో బోనంతో కౌన్సిలర్ సంగీత ప్రభాకర్‌రెడ్డి

ఘనంగా భోగ్ బండార్


భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ బీబ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, గిరిజనలు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 28: గిరిజనుల ఆరాధ్యదైవమైన జగదాంబదేవి మాత, సేవాలాల్ మహరాజ్ జెండాపూజ భోగ్ బండార్ కార్యక్రమంలో ఘనాపూర్ అనుబంధ గ్రామం ఫకీర్ టెక్యా తండాలో ఆదివారం ఘనంగా జరిగింది. జగదాంబ దేవి మాతా, సేవాలాల్ మహరాజ్ ఆలయంలో గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించి, జెండ పండుగను జరుపుకున్నారు. తండావాసులు అధికసంఖ్యలో పూజ కార్యక్రమంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తండాకు చెందిన చిన్నారి నానావత్ పద్మశ్రీనాయక్ చేతిలో త్రిశులం పట్టుకొని జగదాంబదేవిమాత వేషధారణలో అలరించింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ నానావత్ రూప్‌సింగ్‌నాయక్, తండ నాయక్ వడ్త్య రాజునాయక్, ఆలయ పూజారి రామావత్ అమర్‌సింగ్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ మహేందర్‌నాయక్, గ్రామస్తులు నానావత్ సురేష్‌నాయక్, శివాజీ నాయక్, పవన్‌నాయక్, మన్ను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో బీజేపీ జెండా ఎగురవేయాలి


బీజేపీలో చేరుతున్న డాక్టర్ రాజశేఖర్

వికారాబాద్, జూలై 28: రానున్న రోజుల్లో వికారాబాద్ మునిసిపల్‌లో బీజేపీ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ. ప్రతి వార్డులో బీజేపీని బలపర్చి వచ్చే ఎన్నికల్లో మునిసిపల్‌లో అత్యధిక స్థానాలు పొందే విధంగా కృషి చేయాలన్నారు. మాదవరెడ్డి సమక్షంలో వికారాబాద్ మా శారద హాస్పిటల్ డాక్టర్ రాజశేఖర్ బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, పాండుగౌడ్, పోకల సతీష్, విజయ్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళం

కులకచర్ల, జూలై 28: మండల కేంద్రంలో శివాలయం నిర్మాణానికి కాంగ్రెస్ మండల నాయకుడు కర్రె భరత్‌కుమార్ విరాళం అందించారు. వీరశైవలింగాయత్ సభ్యులకు ఆదివారం రూ.లక్ష అందించడంతో కర్రె భరత్‌కుమార్ దంపతులను వారు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సభ్యులు ప్రకాశ్, సుంకరి వినోద్, శంకర్, శ్రీప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం


యాలాల: కోకట్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్పందన


ధారూరు: కేరెల్లిలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

యాలాల, జూలై 28: గ్రామంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని యాలాల మండలం కోకట్ మాజీ ఎంపీటీసీ శంకర్ అన్నారు. తాండూరుకు చెందిన మహాలక్ష్మీ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ స్పందన, ఇతర ఆస్పత్రి సిబ్బంది కోకట్‌లో ఆదివారం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ శంకర్ మాట్లాడుతూ మహాలక్ష్మీ ఆస్పత్రి డాక్టర్లను అభినందించారు. ప్రైవేట్ డాక్టర్లు గ్రామాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ధారూరు: శ్రీ సత్యసాయి సేవాసంస్థలు, సావిత్రమ్మ మెమోరియల్ ట్రస్టు హైదరాబాద్ వారు సంయుక్తంగా మండలంలోని కేరెల్లి గ్రామ శ్రీసత్యసాయి గ్రామీణ సార్వజనీక కేంద్రంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సాధురాం కంటి వైద్యశాల హైదరాబాద్ శాఖ కంటి వైద్యులు రోగులకు కంటి పరీక్షలు చేశారు. శిబిరంలో 212 మందికి కంటి పరీక్షలు చేయగా ఇందులో 109మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కంటి శస్త్ర చికిత్సకు 37 మందిని గుర్తించి 12మందిని కాంటాక్టు ఆపరేషన్ నిమిత్తం సాధురాం కంటి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ శిబిరంలో సావిత్రమ్మ మెమోరియల్ ట్రస్టు సమన్వయ కర్త చిరంజీవిరెడ్డి, శ్రీ సత్యసాయి గ్రామీణ సార్వజనీక కేంద్రం ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్, సేవా సమితి కన్వీనర్ రామకృష్ణారెడ్డి, కంటి వైద్యులు డాక్టర్ భగవాన్, డాక్టర్ అజిత్, డాక్టర్ లక్ష్మణ్‌లు, సాధురాం కంటి వైద్యశాల క్యాంపు సమన్వయకర్తలు యాదగిరి, రామకృష్ణ, సత్యసాయి సేవాసమితి సమన్వయకర్తలు, సేవాదళ్ సభ్యులు, బాల వికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం


ఊటుపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శిని సన్మానించిన గ్రామస్థులు

దోమ, జూలై 28: మండలంలోని ఊటువల్లి గ్రామంలో ఇటీవల బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి లాలునాయక్‌కు ఆదివారం గ్రామ స్థులు పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. ఐదు సంవత్సరాలు పాటు సేవలు అందించి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శి లాలునాయక్‌తో పాటు నూతనంగా విధుల్లో చేరిన కార్యదర్శి విజయ్‌కుమార్‌ను గ్రామస్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మామిళ్ల నర్సింహులు, మాజీ ఉపసర్పంచ్ గోపాల్, గ్రామస్థులు రాజేందర్, రాజు, అనంతయ్య, సత్యనారాయణ, బాబా, కృష్ణయ్య, గోపాల్, జోగు శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

దోమ, జూలై 28: మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన పరంగళ్ల సాయికుమార్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్ ఆదివారం గ్రామానికి వెళ్లి వైద్యం కోసం రూ.10వేలు ఆర్థిక సాయం చేశాడు. ఈ కార్యక్రమంలో మేకల గోవర్ధన్, మణికంఠ, రాములు, శ్రీనివాస్, మహేశ్, లక్ష్మయ్య, శాంతయ్య, వెంకటయ్య, ఆంజనేయులు, వెంకట్రాములు, గురక కృష్ణ, ఏర్పుల సాయిలు, బ్యాగరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

పరిగి, జూలై 28: వాతావరణంలో మార్పుల కారణంగా జనం విషజ్వరాల బారిన పడుతున్నాడు. 15రోజుల నుంచి ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి. టైఫాయిడ్, మలేరియా డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. వర్షాకాలం ప్రారంభంలో ఎక్కువగా అతిసారం సోకేది. ప్రస్తుతం అతిసార బాధితుల సంఖ్య తగ్గినా విషజ్వరాల బాధితుల సంఖ్య మాత్రం పెరిగింది. పరిగి, కులకచర్ల, చిట్యాల్, దోమ ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. డెంగీ కేసులు కూడా నమోదవుతున్నాయి. టైఫాయిడ్, మలేరియా బాధితుల సంఖ్య వేలల్లో నమోదువుతున్నాయి. అధిక వర్షాలు, ఆతర్వాత వర్షాభావం, వాతావరణంలో మార్పులతోనే రకరాల వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రధానంగా దోమలు విజృంభించి రోగాలపడే విధంగా చేస్తున్నాయి. చిన్నపిల్లలకు అయితే మరీ ఎక్కువగా విషజ్వరాలు వస్తున్నాయి. ల్యాబ్‌లు, మెడికల్‌షాపులు, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ఇదే అదనుగా అందినకాడికి దోచుకుంటున్నారు.

వైరల్ ఫీవర్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల బాధితుల సంఖ్య పెరుగుతున్నది. మాములు జ్వరమే కదా అని నిర్లక్ష్యం చేయొద్దు. టైఫాయిడ్, మలేరియా రోగుల సంఖ్య పెరిగింది. దోమ కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వేడివేడి పదార్థాలనే తినాలి. కాలిచల్లార్చిన నీటిని తీసుకుంటే మంచిది. టైఫాయిడ్, మలేరియాకు అంటీబయోటిక్ మందులను నాలుగైదు రోజుల కోర్సును కచ్చితంగా తీసుకోవాలి.



- డాక్టర్ ప్రవీణ్‌కుమార్, చిట్యాల ఆస్పత్రి

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల మద్యం పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, జూలై 28: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, చందుపట్లగూడకు చెందిన పంజాల సందీప్(30) ఎదులాబాద్ అనుబంధ గ్రామం కొత్తగూడెంకు చెందిన బాలబోయిన శ్రీశైలంయాదవ్(40)లు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు దాడిచేశారు. వీరివద్ద నుంచి కింగ్‌ఫిషర్ బీర్లు 20, గుడ్‌డే విస్కీ 34 స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోచారంలో..

పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ లక్ష్మీనర్సింహా కాలనీలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న ఓ ఇంటిపై దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజువర్మ తెలిపారు. నానావత్ వినోద అలియాస్ లక్ష్మీ బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు దాడిచేసి అఫీసర్స్ చాయిస్ 180ఎంఎల్ మూడు, డౌన్-టౌన్ బాటిళ్లు 26, అఫీసర్స్ చాయిస్ 90 ఎంఎల్ 30బాటిళ్లు, ఐబీ ఒక బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వినోదను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ముగ్గురికి గాయాలు


ఘటనాస్థలంలో బైక్, కారు

ధారూరు, జూలై 28: ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఎబ్బనూర్ గేట్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన చింటూ, సంజిత్, రాహుల్‌లు బైక్‌పై దోర్నాలలోని తౌరియానాయక్ వద్ద జరిగే ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు బైక్‌పై బయల్దేరారు. ఎబ్బనూర్ గేట్ వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను తాండూర్ వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న సంజిత్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చింటూ, రాహుల్‌లకు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డును బాగుచేయించండి


సాయిపూర్ న్యూనలందా వద్దనున్న రోడ్డు పరిస్థితి

తాండూరు, జూలై 28: తాండూరు పట్టణం సాయిపూర్ ప్రాంతంలోని న్యూ నలందా హైస్కూల్‌కు వెళ్లే రోడ్డు మార్గం పూర్తి బురదమయంగా మారింది. ఈ రోడ్డు బాగు చేయించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కాలనీవాసులు విన్నవించుకున్నారు. తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు ఆదివారం వినతిపత్రాన్ని సమర్పించారు. త్వరలోనే నిధులు కేటాయించి సమస్యను పరిష్కారిస్తానని కాలనీవాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బంటు మల్లప్ప, కాలనీ వాసులు వీరేశం, ఆనంద్‌గౌడ్, మల్లేశం, కిష్టప్ప, చేతన్ పాల్గొన్నారు.